# "ఇది కథ కాదు!"

సిగ్నల్ యిచ్చారు. మరోసారి హరితకి జాగ్రత్తలు చెప్పి, కిటికీ పక్క సీట్లో కూర్చున్న వయసుమళ్ళిన వ్యక్తికి "తాతగారూ! హరితని కాస్త చూసుకొండి, వంటరిగా వెళ్ళడం యిదే మొదటిసారి" అంటూ హరితని మరోసారి అప్పగించి, కదులుతున్న రైలుతో నడుస్తూ, "టాటా" చెప్తూ "చేరగానే వైరివ్వమని మామయ్యకి చెప్పు. విష్ యు ఆల్ ది బెస్టు. నేను బైటికెళ్ళగానే మామయ్యకి వైరిస్తా నువ్వు బయలు దేరినట్టు" అంటున్న అతని మాటలు పూర్తవకుండానే రైలు స్పీడందుకుంది. స్టేషన్ బైటి కొచ్చిన శ్రీకాంత్ పోస్టాఫీసు కెళ్ళి హరిత ఫలానా రైలులో బయలుదేరినట్లు, స్టేషన్‌కి వెళ్లి దింపుకోమని ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాము మామగారి పేర యిచ్చి యింటి ముఖం పట్టాడు.

పెళ్ళికి ముందు కలకత్తాలో వుండగా అప్లై చేసిన ఉద్యోగానికి ఇంటర్వ్యూ రావడంవల్ల వెంటనే హరితని పంపమని మామగారు టెలిగ్రాము యివ్వడంతో హరితని స్టేషన్‌కి తీసుకెళ్ళి, ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ దొరకనందున జనరల్ కంపార్టుమెంటు ఎక్కించి వచ్చాడు శ్రీకాంత్. జనం ఎక్కువగానే వున్నప్పటికి హరితకి కూర్చోడానికి సీటు దొరికింది. ఎక్కువ సామాను లేనందున జనరల్ కంపార్టుమెంటయినా యిబ్బందనిపించలేదు హరితకి. పైగా భర్త అప్పగించిన తాతగారు కలకత్తా ముందు స్టేషన్ దాకా వస్తున్నారన్న ధైర్యం కూడా వుంది.

రైలు కదలగానే ఎక్కడి వారక్కడ సర్దుకుని కూర్చున్నారు. ముగ్గురు కూర్చోవలసిన సీట్లో యిరుకిరుగ్గా అయిదుగురు చొప్పున కూర్చున్నారు. కాసేపటికి ఒకరి నొకరు పలకరించు కోసాగారు. ఆరు బెర్తులకి హరిత ఒక్కర్తే స్త్రీ కావడం వల్ల మగవారి మధ్య కూర్చోడం కాస్త ఎబ్బెట్టుగానే వుంది.

'ఎంతదాకా వెళ్తున్నారు?' అన్నాడు పక్కనే కూర్చున ఓ నలభైయ్యేళ్ళ వ్యక్తి. 'కలకత్తా' అని చెప్పగానే "ఏంపని మీద వెళ్తున్నారు? అక్కడెవరున్నారు? స్టేషన్‌కి మీ వాళ్ళొస్తారా? మీకు ఊరు తెలుసా? మీ వాళ్ళు ఎన్నేళ్ళయి వుంటున్నారు?" వంటి ప్రశ్నలెయ్యసాగాడు.

హరిత అతనికి వెళ్తున్న కారణం చెప్పి, తనవాళ్ళు స్టేషన్ కొస్తారని, తనకి ఊరు అంత బాగా తెలీదని, ఈ మధ్యే తల్లీ తండ్రీ ఇల్లు కూడా మారేరని మామూలగా సమాధానాలు చెప్పింది.

"నేనూ కలకత్తాకే వెళ్తున్నాను. నా పేరు బోస్ అంటారు. నీకేం పరవాలేదు. నేనున్నా"

నని చెప్పి "స్టేషన్ కొచ్చినతను నీ భర్తా? ఎన్నాళ్ళయి పెళ్ళయింది? మీలో యింత చిన్న వయసులో పెళ్ళి చేసేస్తారా?" అంటూ మళ్ళీ అడగసాగాడు.

'మేనరిక'మని, 'నెల్లాళ్ళ క్రితమే పెళ్ళయిం'దని చెప్పింది.

భోజనాల వేళ అవగానే ఆ వ్యక్తి ఓ స్టేషన్‌లో దిగి పూరీలు తెచ్చి ఆమెకి దగ్గరగా కూర్చుని ఎంత వద్దన్నా వినకుండా, హరితని కూడా తన ప్లేట్లోంచి తీసుకుని తినమని బలవంత పెట్టసాగాడు.

రాను రాను హరిత కెందుకో అతని మాటలు, ప్రవర్తన నచ్చక, తాతగారి నడిగి విడిగా వున్న ఆయన సీట్లోకి మారతానని, ఆయన్ని తన సీట్లో కూర్చోమని బ్రతిమాలింది. తాతగారు హరిత అవస్థ చూసి 'సరే' అన్నారు.

ఎదురుగా కూర్చున్న ఆ వ్యక్తి చూపులు మాత్రం హరిత మీంచి మళ్ళటంలేదు.

మర్నాడు సాయంత్రం ఏడుగంటల వేళ కలకత్తా చేరింది రైలు. తాతగారు ముందు స్టేషన్‌లో దిగిపోతూ జాగ్రత్తగా వుండమని చెప్పారు. రైలంతా ఖాళీ అవుతోంది. బోస్ వచ్చి "మీకు ఏదన్నా సహాయం కావాలా" అని అడిగాడు.

'అక్కర లేదు. మా వాళ్ళొస్తారని చెప్పి బేగ్ తీసుకుని ప్లాట్ ఫారం వైపుకి వెళ్ళి నిలబడి తన వాళ్ళ రాకకోసం ఎదురు చూడసాగింది హరిత.

కాస్సేపటికి మళ్ళీ వచ్చి బోస్ "మీ వాళ్ళెవరూ వచ్చినట్లు లేదు, మిమ్మల్ని మీవాళ్ళింటి దగ్గర దింపనా?" అని అడిగాడు.

అప్పటికే చీకటి పడిపోతోంది. రైలొచ్చి అరగంట దాటుతోంది. తనవాళ్ళెవ్వరూ స్టేషన్‌కి రాలేదు. ఓ పక్క పిశాచంలా వెంటాడుతున్న బోస్. హరిత కెందుకో ధైర్యం చాలటం లేదు. తను అధైర్య పడుతున్నట్లు ఆ వ్యక్తికి కనపడ కూడదనుకుంటూ, "నా దగ్గర ఎడ్రస్ వుంది. బస్సెక్కి వెళ్ళిపోగలను, నాకెవరి సహాయం అక్కరలేదు, దయచేసి వెళ్ళండి" అని గట్టిగా చెప్పడంతో బోస్ వెళ్ళిపోయాడు.

టైము ఎనిమిది కావస్తోంది. చీకటి పడిపోయింది. ఇంక అక్కడ నిలబడటం మంచిది కాదని, బేగ్ తీసుకొని నెమ్మదిగా స్టేషన్ బైటి కొచ్చి, బస్‌స్టాండ్ వైపుకి నడవసాగింది హరిత.

బస్‌స్టాప్‌లో నిలబడ్డ వ్యక్తులకి తన తండ్రి ఎడ్రస్ చూపించి, ఏ బస్ వెడుతుందో తెలుసుకుని, ఆ నెంబరు బస్ కోసం ఎదురు చూడసాగింది. హరిత భుజాన్నున్న బేగ్‌దింపి అలసిపోయిన తన శరీరాన్ని అక్కడే వున్న సిమెంట్ స్లేబ్ లాంటి దాని మీదకి చేర్చింది.

రెప్పపాటులో వచ్చారు పహిల్వానుల్లాంటి మగవాళ్ళు నలుగురు. నల్లటి కాయ శరీరాలు, బుర్ర మీసాలు, జునపాల్లాంటి జుట్టు, రక్తం చిమ్ముతున్నట్లున్న ఎర్రటి కళ్ళు, నిక్కర్లు, బనీన్లతో వచ్చి హరితకి ఎదురుగా నిలబడ్డాడు. వాళ్ళ వెనకో వచ్చిందో బెంగాలీ

కట్టులో వున్న ఓ యాభై ఏళ్ళు దాటిన ఆడది, కారా కిళ్ళీ నములుతూ. ఎవరు చూసినా యిట్టే చెప్పగలరు ఆమె భోగం స్త్రీ అని, వాళ్ళు రౌడీలని!

వచ్చీ రావడమే హరిత చేతులు పట్టుకుని రోడ్డు మీదకి లాక్కుపోసాగారు. "రక్షించండి, రక్షించండి" అని ఎంత అరిచినా, చుట్టుపక్కల వున్న ఏ ఒక్కరూ అడ్డుపడకుండా చూస్తూ వుండిపోవడంతో, హరిత దుఃఖం ఆగక, గింజుకుంటూ, కేకలు పెడుతూ, గోలపెట్టసాగింది.

అలా ఓ ఫర్లాంగు దూరం ఈడ్చుకు పోయిన తరువాత హరిత వెంట ఓ అరవై ఏళ్ళ వ్యక్తి "కాంతం! కాంతం!" అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి హరిత చెయ్యి పట్టుకుని "ఏమిటమ్మా! తల్లీ! ఎక్కడికి ఈడ్చుకు పోతున్నారు వాళ్ళు? వీళ్ళెవరు?" అంటూ ఆ రౌడీల వైపు తిరిగి "ఎవరు మీరు? నా కూతుర్ని ఎక్కడికి లాక్కెళ్తున్నారు? రాస్కెల్సు! వదలండి నా బిడ్డ" అంటూ బెంగాలీలో అరుస్తూ వాళ్ళ చేతుల్లోంచి హరిత చేతిని లాగి పక్కనే నిలబడ్డ భోగందాని చేతిలోంచి హరిత బేగ్ లాక్కొని, హరిత చెయ్యి పట్టుకుని నడిపించుకెళ్ళసాగాడు.

హరితతో తెలుగులో మాట్లాడి, చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళడంతో, ఆ రౌడీలు, నాయకురాలు పరుగులాంటి నడకతో అక్కడినుంచి పారిపోయారు.

దిక్కుతోచక, గాబరాపడుతూ, ఏడుస్తున్న తనని ఓ అపరిచిత వ్యక్తి వచ్చి ఆదుకోవడం, అందునా ఆ వ్యక్తి తెలుగువాడే కావడం చూసి హరిత ఆశ్చర్యపోతూ రెండు చేతులూ జోడించి, "ఎవరు బాబూ మీరు? దేముడు పంపినట్లు వచ్చి నన్ను కాపాడారు?" అంటూ అడిగింది.

"అమ్మా! నీ పేరేమిటో తెలీదు. ముందు మా యింటికిరా! ఈ దగ్గర్లోనే వుంది. సావకాశంగా నీకు అంతా చెప్తాను. నువ్వు చాలా గాబరా పడిపోయి వున్నావు. మా యింట్లో నా భార్య, నీ అంత కూతురూ వున్నారు. నీకేం భయంలేదు." అన్నాడు సందేహంగా తనవైపు చూస్తున్న హరిత మనసులో భావాన్ని కనిపెట్టినట్లు.

మొదట్లో "ఈ కొత్త వ్యక్తి ఎవరు? ఆ రౌడీల నుంచి తప్పించి ఈయనెక్కడికి తీసుకెళ్తాడో?" అన్న భీతి కలిగినప్పటికి " 'మన ఆంధ్రుడు' అందునా వయసు మీరిన వ్యక్తి యిలాంటి దారుణానికి పాల్పడతారా?" అని మనసు ధైర్యం చెప్తుంటే అతనివెంట సంచీ తీసుకుని బయలుదేరింది.

'శాంతా! మనింటికో అతిథిని తీసుకొచ్చాను చూడు! పాపం ఈ అమ్మాయి రైలు దిగి బస్స్టాండులో నిలబడగానే భోగం నాయకురాలు రౌడీలని తీసుకొచ్చి ఈ అమ్మాయి జబ్బ పట్టుకుని లాక్కెళ్ళి పోతున్నారుట. ఆ బస్స్టాండులోనే నిలబడ్డ ఓ బెంగాలీ యువకుడు పార్కులో కూర్చున్న నా దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చి 'సార్! మీరు మదరాసిలా? అయితే వెంటనే ఆవేపుకి పరిగెత్తండి. ఓ అమ్మాయి మానం కాపాడిన వారవుతారు! ఓ మదరాసీల అమ్మాయిని వ్యభిచార గృహాలు నడిపే పేరుమోసిన ఆడది గూండాల సహాయంతో ఈడ్చుకు పోతోంది. మీరు వెళ్ళి రక్షించకపోతే మరో గంటలో ఆ పిల్ల జీవితం నాశనం అయిపోతుంది.

నేనే అడ్డుపడుదును, లోకల్ వాళ్ళం కదా, మమ్మల్ని అక్కడికక్కడే ఖూనీ చేసేస్తారు. మీరు మదరాసీలు గనక ఏమీ అనరు. పరిగెత్తండి సార్! పాపం ఆ పిల్ల గోల, గోల పెడుతోంది. చిన్నపిల్ల సార్!" అంటూ ఆయసపడుతూ చెప్తున్న మాటల్నివిని పరుగెత్తుకెళ్ళి నేను నాకు తోచిన పేరుతో ఆ అమ్మాయిని పిల్చి, వాళ్ళని బెదిరించి, నా కూతురని నాటకం ఆడి వాళ్ళ చేతుల్లోంచి విడిపించి తీసుకొచ్చాను. పాపం పిల్ల బెదిరిపోయి వుంది. చూడు, కాస్త ధైర్యం చెప్పు. ఎప్పుడు తిందో ఏమిటో! కాస్త ఏదన్నా యివ్వు. కాస్త స్థిమితపడ్డాకా ఆ అమ్మాయిని తీసుకెళ్ళి తల్లితండ్రుల కప్పగించి వస్తా" నంటూ చెప్పిన మాటలు విని హరిత మనసులోనే "మానవ రూపంలో వచ్చిన దైవానివి బాబూ!" అంటూ నమస్కరించింది.

"ఇది ఆ రైల్లో వెంటాడిన వ్యక్తి యొక్క అసలు రూపమన్నమాట" అనుకుంది. "ఇదంతా అతను ఆడించిన నాటకమే అన్నమాట. నన్ను ఇంటి దగ్గర దింపుతాను రమ్మన్నప్పుడు, అతనితో వెళ్ళివుంటే ఏమయ్యేది??" అన్న ఆలోచన రాగానే హరిత శరీరంలో సన్నని వణుకు ప్రారంభమయింది.

రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో హరిత, ఓ పెద్ద మనిషితో ఇంటికి రావడం చూసిన హరిత తల్లి తండ్రులు, ప్రాణం లేచొచ్చినట్లు పరిగెత్తుకొచ్చి, హరితని కౌగిలించుకుని 'అమ్మా! వచ్చావా తల్లీ! పోస్టల్ వాళ్ళ ధర్మమా అని అల్లుడిచ్చిన టెలిగ్రాము రాత్రి ఎనిమిదింటికి అందింది. చూసి వెంటనే స్టేషన్‌కి వెళ్తే రైలెళ్ళి పోయిందన్నారు. కొత్తచోటు ఎలా వస్తావో? ఈ చీకట్లో అని గాబరా పడుతూ బస్టాండుకి వెళ్ళాము. అక్కడ నీ గుర్తులు చెప్పి 'ఎవరేనా వచ్చేరా?' అని పక్కనేవున్న కిళ్ళీ కొట్టువాడినడిగితే 'ఈవూళ్ళో పేరుమోసిన భోగంది రౌడీలని తీసుకొచ్చి ఎవరో యిరవై ఏళ్ళ అమ్మాయిని లాక్కెళ్ళిపోయిందని, ఒంటరిగా వచ్చే ఆడపిల్లల్నిలా లాక్కెళ్ళడం మామూలని చెప్పగానే ఏం చెయ్యాలో తోచక పోలీస్ రిపోర్టిచ్చి వచ్చి, దేముళ్ళకి మొక్కుకుంటూ గోలగోల పెడుతున్నాం తల్లీ!" అని చెప్పగానే హరిత వెంట వచ్చిన వ్యక్తి తనపేరు శంకరం అని చెప్పి, జరిగిన విషయమంతా చెప్పి హరితని వారితల్లి తండ్రుల కప్పగించాడు. హరిత తల్లి తండ్రులు అతనికి నమస్కరిస్తూ 'అమ్మా హరితా! నిన్ను మాకు అప్పగించి, నీకు కొత్త జీవితాన్నిచ్చిన ఈ దైవానికి నమస్కరించు తల్లీ! అనగానే-

'నాకు కాదండీ! నాకొచ్చి చెప్పిన ఆ బెంగాలీ వ్యక్తికి నమస్కరించమని చెప్పండి. మీ అమ్మాయిని తీసుకెళ్తున్నట్లు పరిగెత్తుకొచ్చి నాకు అతను చెప్పి వుండకపోతే నేనేం చెయ్యగలిగే వాడిని?! అతనో మీకు కనపడని మరో దేముడు, దొడ్డ మనసుగల మహా మనిషి" అంటూ శలవు తీసుకున్నాడు.

ఇది కథ కాదు. నిజంగా జరిగిన సంఘటన మాత్రమే! ఇప్పటికీ ఆ సంఘటన గుర్తొస్తే వణికి పోతూ, కళ్ళ నీళ్ళు వచ్చేస్తాయి ఆ అదృష్టవంతురాలికి.

**- కలువబాల, 1-15 ఆగస్టు, 1988**